సాక్షి
పశ్చిమగోదావరి
బుధవారం । 11 । జూన్ । 2025



జూదాలకు బానిసై..
జూదాలకు బానిసైన ఓ వ్యక్తి యజమాని ఇంట్లో చోరీకి పాల్పడ్డాడు. పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. 8లో ▸



మురుగు పారేదెలా!
డ్రెయిన్లలో పూడిక తొలగించక గుర్రపుడెక్క, చెత్త పేరుకుపోయి వర్షాకాలంలో పొలాలు మునిగిపోతున్నాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 8లో ▸



ఇప్పుడు మోగల్లు వంతు
ఉండి సెంటర్‌లో చిరువ్యాపారులను ఆక్రమణల పేరిట ఖాళీ చేయించగా, ఇటీవల పాలకోడేరులో తొలగించారు. ఇప్పుడు మోగల్లు వంతు వచ్చింది. 8లో ▸

న్యూస్‌రీల్

అధినేతతో ఆత్మీయ కలయిక



వైఎస్ జగన్‌మోహనరెడ్డిని కలిసిన మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డిని మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మంగళవారం తాడేపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి పాటుపడాలని, భవిష్యత్తులో మనమే అధికారంలోకి వస్తామని వైఎస్ జగన్‌ను అన్నట్లు కొట్టు సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4న వెన్నుపోటు దినం తాడేపల్లిగూడెంలో భారీగా నిర్వహించడం సంతోషకరమని, పార్టీ పిలుపు మేరకు భవిష్యత్తులో మరిన్ని పార్టీ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని సూచించినట్లు చెప్పారు. పార్టీ నియోజకవర్గ నాయకులందరినీ ఒకతాటిపైకి తీసుకురావాలని, పార్టీ అభివృద్ధి కోసం ప్రజలతో మమేకం కావాలని పార్టీ అధినేత సూచించినట్లు తెలిపారు. జగన్‌మోహనరెడ్డిని కలిసిన వారిలో ముప్పిడి సంపత్ కుమార్, పట్టణ పార్టీ అధ్యక్షుడు కొలుకులూరి ధర్మరాజు, 2వ పట్టణ ఇన్‌చార్జి కర్రి భాస్కరరావు తదితరులున్నారు.

టిడ్కో ఇళ్లు ఇవ్వాలంటూ ధర్నా



భీమవరం ఆర్డీవో కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం పట్టణంలో టిడ్కో, జగనన్న ఇళ్లు సత్వరం పంపిణీ చేయడమే గాక ప్రభుత్వ భూమిలో ఇళ్లు నిర్మించుకున్నవారికి ఇళ్ల పట్టాలు తక్షణం ఇవ్వాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మంగళవారం భీమవరం ఆర్డీవో కార్యాలయం వద్ద టిడ్కో, జగనన్న ఇళ్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. తాడేరు రోడ్డులో 82 ఎకరాల్లో నిర్మించిన టిడ్కో ఇళ్లు ఇంతవరకు ఇవ్వకపోవడం అధికారులు, ప్రజాప్రతినిధుల చేతగానితనానికి నిదర్శనమని విమర్శించారు. జగనన్న ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కూటమి ప్రభుత్వాన్ని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో అనేకసార్లు ధర్నాలు నిర్వహించినా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు కూటమి నేతలు ప్రభుత్వ భూముల్లో నివాసం ఉన్న వారికి ఇళ్ల పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జీవో విడుదల చేసినా ఇంతవరకు ఎక్కడా ఇళ్ల పట్టాలు ఇవ్వలేదని ధ్వజమెత్తారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు డి.కళ్యాణి, ఎం.వైకుంఠరావు, డి.త్రిమూర్తులు, చెల్లుబోయిన వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దేవస్థానం ఉద్యోగుల బదిలీ

ద్వారకాతిరుమల: రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల్లో పనిచేసే పలువురు ఉద్యోగులను బదిలీ చేస్తూ రాష్ట్ర దేవాదాయ శాఖ ఇన్‌చార్జి కమిషనర్ రామచంద్ర మోహన్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో పనిచేసే కొందరు ఉద్యోగులకు స్థానచలనం కలిగింది. డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (డీఈఓ) బాబురావు, జూనియర్ అసిస్టెంట్ కేహెచ్ ప్రసాద్‌లు అన్నవరం దేవస్థానానికి, సూపరింటిండెంట్ డీవీ నరసింహరాజు పెనుగంచిప్రోలులోని తిరుపతమ్మ దేవస్థానానికి, సీనియర్ అసిస్టెంట్ కేవీ నరసింహ, జూనియర్ అసిస్టెంట్‌లు ఎ.చిట్టిబాబు, వి.జగన్నాథరావులు విజయవాడ దేవస్థానానికి బదిలీ అయ్యారు. అరసవెల్లి దేవస్థానంలో డీఈఓగా పనిచేస్తున్న భద్రాజీ, పెనుగంచిప్రోలు తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానంలో ఏఈఓగా పనిచేస్తున్న జి.ఉమాపతి, విజయవాడ దేవస్థానంలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న వి.కుటుంబరావు, సూపరింటిండెంట్‌గా పనిచేస్తున్న వి.నగేష్, సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎం.తులసీరామ్, జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కేవీబీ కాత్యాయనిలు, అన్నవరం దేవస్థానంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎ.శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బి.పవన్ కుమార్ ద్వారకాతిరుమల దేవస్థానానికి బదిలీ అయ్యారు. డిప్యుటేషన్‌పై అన్నవరం దేవస్థానానికి బదిలీపై వెళ్లిన సూపరింటిండెంట్ జి.సుబ్రహ్మణ్యం, సీనియర్ అసిస్టెంట్ పీవీ శ్రీనివాసరావును ద్వారకాతిరుమలకు బదిలీ చేశారు.

పడకేసిన ప్రగతి

ఏడాది పాలనలో సూపర్ సిక్స్ హామీలను అటకెక్కించిన కూటమి ప్రభుత్వం అభివృద్ధిని కుంటుపడేలా చేసింది. గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా గత వైఎస్సార్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను గాలికొదిలేసింది. రూ.75 కోట్ల విలువైన పనులను రద్దుచేసి.. త్వరలో తమ వెతలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్న స్థానికుల ఆశలపై నీళ్లు చల్లింది.



పాలకోడేరు మండలం మోగల్లులో అసంపూర్తిగా నిలిచిన సచివాలయం

- కూటమి నిర్లక్ష్యంతో కుంటుపడిన అభివృద్ధి
- జిల్లాకు 353 సచివాలయాలు, 298 ఆర్‌బీకేలు, 214 హెల్త్ క్లినిక్‌లు మంజూరు
- గతంలోనే 70 శాతం భవనాలు పూర్తి చేసి వినియోగంలోకి తెచ్చిన ప్రభుత్వం
- కూటమి వచ్చాక నిర్మాణాలకు బ్రేక్
- రూ.75 కోట్ల విలువైన రోడ్లు, వంతెనల నిర్మాణాల పనులు రద్దు

సాక్షి, భీమవరం: పల్లెల ప్రగతికి గత ప్రభుత్వం పెద్దపీట వేసింది. గతంలో మండల, జిల్లా కేంద్రాలకే పరిమితమైన పాలన వ్యవస్థల్ని పల్లెలకు చేర్చడం ద్వారా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ సేవల్ని ప్రజలకు చేరువ చేశారు. అందుకోసం సచివాలయ వ్యవస్థను తెచ్చి ఒక్కో సచివాలయంలో 11 శాఖల ఉద్యోగులను నియమించారు. 35 ప్రభుత్వ శాఖలకు చెందిన 500కు పైగా సేవలను అందుబాటులోకి తెచ్చారు. ప్రజలు, ఉద్యోగులకు సౌకర్యవంతంగా ఉండేలా ఒక్కో సచివాలయానికి రూ.40 లక్షల చొప్పున జిల్లాలో 353 భవన నిర్మాణాలకు సుమారు రూ.141.2 కోట్లు మంజూరు చేశారు. కూటమి వచ్చే నాటికి వీటిలో 270 భవనాలు పూర్తి కాగా మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. అన్నదాతల కోసం ఆర్‌బీకేల ద్వారా సాగులో సరికొత్త అధ్యాయానికి గత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. విత్తు నుంచి పంట ఉత్పత్తులు విక్రయం వరకు ఇవి అన్నదాతలకు అడుగడుగునా అండయ్యాయి. సబ్సిడీపై విత్తనాలు, ఎరువులతో పాటు కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, పంట రుణాలు, విపత్తుల సమయంలో ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా పరిహారం అందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. జిల్లాలో రూ. 65 కోట్లు వ్యయంతో 298 భవన నిర్మాణాలు చేపట్టగా గతంలోనే వీటిలో 211 భవనాలు వినియోగంలోకి వచ్చి రైతులకు సేవలందిస్తున్నాయి. గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఆధునిక వసతులతో హెల్త్ క్లీనిక్‌లు నిర్మించింది. ఒక్కో 214 హెల్త్ క్లినిక్‌లకు రూ.53.5 కోట్లు మంజూరు చేసింది. 96 భవనాలు పూర్తిచేసి వినియోగంలోకి తెచ్చింది.

పడకేసిన పనులు : గత ప్రభుత్వంలో ఆయా భవన నిర్మాణాలు శరవేగంగా సాగాయి. సుమారు 83 సచివాలయ భవనాలు, 87 ఆర్‌బీకేలు, 118 హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం మిగిలి ఉంది. వీటిలో 18 సచివాలయ, 16 ఆర్‌బీకే, 14 హెల్త్ క్లినిక్‌లు పనులు దాదాపు పూర్తికాగా మిగిలినవి వివిధ దశల్లో అసంపూర్తిగా నిలిచిపోయాయి. వీటిని పూర్తి చేసే దిశగా కూటమి ప్రభుత్వం చొరవ చూపక చాలా వరకు పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. బీసీ, ఎస్సీ సామాజిక వర్గాల వారి కోసం నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ పనులు నిధుల లేమితో చాలా చోట్ల అసంపూర్తిగా నిలిచిపోయాయి.



పెనుమంట్రలో జిల్లా పరిషత్ నిధులతో నిర్మిస్తున్న ఎస్సీ కమ్యూనిటీ హాల్ మధ్యలోనే నిలిచిపోయిన దృశ్యం

అభివృద్ధి పనులకు బ్రేక్

భీమవరం రూరల్ గొల్లవానితిప్ప, దొంగపిండి, పట్టణంలో రెస్ట్‌హౌస్ రోడ్డు వద్ద వంతెనలకు అప్రోచ్ రోడ్డులు లేక రాకపోకలు సాగించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గత ప్రభుత్వంలో అప్రోచ్‌ల నిర్మాణానికి రూ. 36.71 కోట్లు మంజూరు చేశారు. వీటిలో కాళీపట్నం- భీమవరం వంతెన వద్ద రూ. 9.22 కోట్లు, భీమవరం-దొంగపిండి వంతెన వద్ద రూ. 16.58 కోట్లు, దెయ్యాలతిప్ప-నాగిడిపాలెం వంతెన వద్ద రూ. 10.91 కోట్లుతో టెండర్ ప్రక్రియ ప్రారంభం కాగా ఈలోగా ఎన్నికలు వచ్చాయి. కూటమి ప్రభుత్వం ఈ ప్రతిపాదనలను అటకెక్కించింది. ఉండి నియోజకవర్గంలోని చినమిల్లిపాడు-ఆకివీడు మెయిన్‌రోడ్డు విస్తరణ పనుల కోసం రూ. 25 కోట్లు, భీమవరం నుంచి కలిదిండి మీదుగా గుడివాడ వెళ్లే రోడ్డులోని బోండాడ డ్రెయిన్‌పై వంతెనకు రూ.12 కోట్లు, ఆచంట నియోజకవర్గం నెగ్గిపూడి, తాడేపల్లిగూడెంలో ఆర్‌అండ్‌బీ ఇన్‌స్పెక్షన్ బంగ్లాల మరమ్మతులకు రూ. 1.57 కోట్ల పనులను రద్దుచేసింది.

వంతెన నిర్మాణం ఎప్పటికో ?



కోపల్లె వంతెన నిర్మాణం ఎప్పటికీ పూర్తవుతుందో అర్థం కావడం లేదు. వంతెన ఇరుకుగా ఉండటం వల్ల నిత్యం ట్రాఫిక్ స్తంభిస్తూనే ఉంటుంది. గత ప్రభుత్వం వంతెన నిర్మాణానికి నిధులు విడుదల చేసిన నిర్మాణానికి నోచుకోలేదు. నిధులు కూడా వెనకకు వెళ్లిన పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితి వంతెన నిర్మాణం ఎప్పటికీ పూర్తవుతుంది అర్థం కావడం లేదు.

– ఎం.అశోక్, కాళ

అప్రోచ్ రోడ్లు లేక నిత్యం ప్రమాదాలు

యనమదుర్రు డ్రెయిన్‌పై నిర్మించిన మూడు వంతెనలకు అప్రోచ్ రోడ్లు నిర్మించకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నాం. సంవత్సరాలు గడుస్తున్న మోక్షం కలగడం లేదు. ఇటు వైపు నుంచి కనిపిస్తున్న ఆవలి వైపు దగ్గర మార్గమే కదా అని ఆటోలు స్కూలు బస్సులు ట్రాక్టర్‌లు వెళ్లి బోల్తా పడుతున్నాయి. దీంతో ప్రయాణికులు వాహనదారులు క్షతగాత్రులై ఆసుపత్రి పాలవుతున్నారు.

– తిరుమాని సూర్యనారాయణ, నాగేంద్రపురం

పోలీసుల సాక్షిగా దారుణం

మూడు రోజులుగా ఏలూరు సాక్షి ఆఫీసు వద్ద దాడులు



కాలిన ఫర్నీచర్‌ను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్, ఏలూరు సమన్వయకర్త జేపీ

ఏలూరు టౌన్: ఏలూరు ఎన్‌ఆర్ పేటలోని సాక్షి జిల్లా కార్యాలయం కింద ఉన్న ఫర్నీచర్‌ను టీడీపీ గూండాలు పెట్రోలు పోసి తగలబెట్టడంతో ఆ ప్రాంతంలోని ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. తమ ఇళ్లకు ఎక్కడ నిప్పు అంటుకుంటుందోనని ఆందోళనకు గురయ్యారు. అధికార టీడీపీ నేతల ప్రొద్బలంతో సాక్షి కార్యాలయంపై వరుసగా మూడు రోజులు దాడులకు తెగబడడం రెడ్‌బుక్ రాజ్యాంగం కాక ఇంకేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఏలూరు ఎన్‌ఆర్ పేటలోని సాక్షి జిల్లా కార్యాలయం వద్ద గత మూడు రోజులుగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆందోళన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం ఏలూరు సాక్షి కార్యాలయం వద్దకు దెందులూరు నియోజకవర్గానికి చెందిన టీడీపీ నేతలు భారీగా వస్తున్నారనే విషయం పోలీస్ ఇంటెలిజెన్స్ విభాగానికి తెలియకపోవడం గమనార్హం. సాక్షి కార్యాలయం వద్ద భవన యజమానులకు సంబంధించిన ఫర్నీచర్‌ను పెట్రోలు పోసి తగలబెడుతున్నా అక్కడ ఉన్న పోలీసులకు గానీ, నిఘా విభాగానికిగాని ఏ మాత్రం తెలియకపోవడం శోచనీయం.

మీడియా గొంతునొక్కే ప్రయత్నం : ఏలూరు సాక్షి కార్యాలయంపై దెందులూరు టీడీపీ నేతలు, కార్యకర్తలు దాడులకు తెగబడి ఫర్నీచర్‌ను పెట్రోలు పోసి నిప్పంటించిన సంఘటనను పలువురు తీవ్రంగా ఖండించారు. వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, ఏలూరు నియోజకవర్గ సమన్వయకర్త మామిళ్ళపల్లి జయప్రకాష్ సంఘటనా ప్రదేశాన్ని పరిశీలించారు. అగ్నికి ఆహుతైన ఫర్నీచర్‌ను పరిశీలించారు. గతంలో సాక్షి కార్యాలయంలో ధ్వంసం చేసిన కంప్యూటర్లను సైతం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం మీడియా గొంతునొక్కే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తూ టీడీపీ నేతలు, కార్యకర్తలు పత్రికా కార్యాలయాలపై దాడులకు దిగడం దుర్మార్గమన్నారు. జిల్లా ఎస్పీ ప్రతాప శివ కిషోర్ దీనిపై ప్రత్యేక దృష్టి సారించి సమగ్రమైన దర్యాప్తు చేసి నిందితులను అరెస్టు చేసి శిక్షించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఇదే తరహాలో ప్రభుత్వంలో ఉన్న నాయకులు మీడియాపై దాడులకు పాల్పడటం ద్వారా చెడు సంప్రదాయానికి బీజం వేస్తున్నట్లు అవుతుందని ఇలాంటివి ఎవరు చేసినా తప్పేనని అభిప్రాయపడ్డారు.

సాక్షి మీడియాపై దాడులు అరికట్టాలి

చింతలపూడి/తణుకు అర్బన్/ఆకివీడు: సంబంధం లేని విషయాన్ని సాక్షికి ఆపాదిస్తూ అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు సాక్షి కార్యాలయాలపై చేస్తున్న దాడులను అరికట్టాలని, దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ చింతలపూడిలో సాక్షి పాత్రికేయుల ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సిఐ టి.క్రాంతికుమార్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. సాక్షి కార్యాలయాలకు రక్షణ కల్పించడంతోపాటు జర్నలిస్టులకు కూడా రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును అక్రమ కేసులో ఇరికించారని తక్షణం విడుదల చేసి అక్రమ కేసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సాక్షి కార్యాలయాలపై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ తణుకు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఎస్సై కె.ప్రసాద్‌కు విలేకరులు వినతిపత్రం అందచేశారు. సాక్షి కార్యాలయాలపై దాడికి దిగిన వారిని గుర్తించి కేసులు నమోదు చేయాలని కోరారు. జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని జర్నలిస్టు గుడిపాటి వెంకటేశ్వరరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సీనియర్ జర్నలిస్టు కె.శ్రీనివాసరావును అరెస్టును నిరసిస్తూ మంగళవారం ఆకివాడు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.



చింతలపూడిలో సీఐ క్రాంతికుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

భీమవరం మున్సిపాలిటీలో బదిలీలు

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం మునిసిపాలిటీలో పలువురు అధికారులు బదిలీ అయ్యారు. అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వరరావు ఇటీవల ఉద్యోగ విరమణ చేయడంతో ఆయన స్థానంలో గుంటూరు కార్పొరేషన్‌లో శానిటరీ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న ఎ.రాంబాబును మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్‌గా నియమించారు. అమృత్ అడిషనల్ ఆడిట్ ఆఫీసర్ బాల సుబ్రహ్మణేశ్వరుడిని విజయవాడకు బదిలీ చేయగా ఆ స్థానంలో మచిలీపట్నం మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఐకెవి సుబ్రహ్మణ్యంను భీమవరానికి బదిలీ చేశారు. సీనియర్ అసిస్టెంట్ ఎస్.కృష్ణమోహన్‌ను నరసాపురం మున్సిపాలిటీకి, జూనియర్ అసిస్టెంట్ పి.మోజేస్ పాలకొల్లు మునిసిపాలిటీకి, భీమశంకరంను తణుకు మునిసిపాలిటీకి బదిలీ చేశారు. భీమవరం హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్‌ను పాలకొల్లు బదిలీ చేశారు.

మహిళల రక్షణలో కూటమి విఫలం

వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో నిరసనలు



పాలకొల్లులో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం సభ్యులు

ఏలూరు టౌన్: రాష్ట్రంలో ఎక్కడ చూసినా మహిళలు, చిన్నారులు, బాలికలు, యువతులపై దాడులు, దౌర్జన్యాలు, అఘాయిత్యాలు పెచ్చుమీరిపోతున్నాయని వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా మహిళా అధ్యక్షురాలు కేసరి సరితారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏలూరు పాతబస్టాండ్ సెంటరులోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందచేశారు. కూటమి ప్రభుత్వంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలకు నిరసనగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సరిత మాట్లాడుతూ అనంతపురంలో దళిత బాలికపై దుండగులు అమానుషంగా హత్యాచారానికి పాల్పడినా నేటికీ చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చింతలపూడి నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు, ఏలూరు మహిళా అధ్యక్షురాలు జిజ్జువరపు విజయనిర్మల, చింతలపూడి మహిళా అధ్యక్షురాలు చండీప్రియ, కైకలూరు మహిళా అధ్యక్షురాలు దున్నా బేబి, దెందులూరు నియోజకవర్గ మహిళా విభాగ అధ్యక్షురాలు అంగడాల సీతారావమ్మ, జిల్లా అంగన్‌వాడీ విభాగ అధ్యక్షురాలు సాయిల స్వాతి, తొత్తడి వేదకుమారి, రాష్ట్ర మహిళా కార్యదర్శి మందా జయలక్ష్మి, అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలు బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమలలో..

ద్వారకాతిరుమల: రాష్ట్రంలో మహిళలకు రక్షణ కల్పించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు దాకారపు బంగారమ్మ అన్నారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో మహిళలపై జరిగిన అకృత్యాలు, అన్యాయాలకు నిరసనగా వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో, రాజమండ్రి సిటీ గోకవరం బస్టాండ్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బంగారమ్మ, పార్టీ ద్వారకాతిరుమల మండల మహిళా అధ్యక్షురాలు మల్లెపూడి నాగమణి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలో మహిళలపై ఎన్నో అఘాయిత్యాలు, అత్యాచారాలు, హత్యలు జరిగాయన్నారు. ప్రభుత్వం వాటిని అరికట్టడంలో పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. గోపాలపురం, దేవరపల్లి మండలాల మహిళా అధ్యక్షురాలు కప్పల వరలక్ష్మి, కదలి హైమావతి, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణేది

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మహిళలకు రక్షణ కల్పించడంలో పూర్తిగా విఫలమైందని వైఎస్సార్‌సిపి మహిళా విభాగం జనరల్ సెక్రటరీ కర్రా జయసరిత అన్నారు. మంగళవారం పూలపల్లి అంబేద్కర్ విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి వినతిపత్రం అందజేశారు. జయ సరిత మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ చూసినా మహిళలపై అత్యాచారాలు, హత్యలేనని.. మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో నరసాపురం పార్లమెంటు వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు, సమన్వయకర్త గూడూరి ఉమాబాల, నరసాపురం మున్సిపల్ చైర్మన్ బర్రి వెంకటరమణ, జెడ్పీటీసీ కర్రి గౌరీ సుభాషిణి, మద్దా చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో..

భీమవరం: కూటమి ప్రభుత్వ పాలనలో మహిళలపై దాడులు పెచ్చుమీరిపోయాయని వైఎస్సార్ సీపీ నాయకురాలు గంటా అనితారాణి ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలపై దాడులను అరికట్టాలని డిమాండ్ చేస్తూ భీమవరం 13వ వార్డులో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు.



ఏలూరు పాతబస్టాండ్ సెంటరులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన



పాలకొల్లులో నినాదాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం సభ్యులు



రాజమండ్రిలో వినతిపత్రం ఇస్తున్న గోపాలపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ మహిళా నేతలు



భీమవరంలో నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలు

స్కూళ్లలో ఉచిత ప్రవేశాలకు గండి

పాత బకాయిలు చెల్లించకపోతే చేర్చుకోమంటున్న విద్యాసంస్థలు

భీమవరం: విద్యకు పెద్దపీట వేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల విద్యార్థులకు సైతం కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్యనందించడానికి తీసుకున్న చర్యలు కూటమి ప్రభుత్వంలో బెడిసికొడుతున్నాయి. ప్రైవేటు స్కూళ్లలో 25 శాతం పేద విద్యార్థులకు కల్పించాల్సిన ఉచిత ప్రవేశాలను రెండేళ్లుగా ఫీజు బకాయిలు ఇవ్వకపోవడంతో ఈ ఏడాది అవకాశమిచ్చేదిలేదని కొన్ని స్కూళ్లు తెగేసి చెబుతున్నాయి. దీంతో ప్రైవేటు స్కూళ్లలో తమ బిడ్డలను చదివించాలనే తల్లిదండ్రుల ఆశలకు గండిపడుతోంది. జిల్లాలోని 20 మండలాల్లో దాదాపు 700 వరకు ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు న్నాయి. వాటిలో ఉచిత విద్యనందించడానికి 397 స్కూళ్లు రిజిస్ట్రేషన్ చేయించుకున్నాయి.

1,380 మంది విద్యార్థుల దరఖాస్తు

ప్రైవేటు స్కూళ్లలో తమ బిడ్డలను ఉన్నత చదువులు చదివించాలనే ఆసక్తి ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు స్తోమత లేకపోవడంతో ప్రభుత్వ బడుల్లోనే చేరుస్తుంటారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రైవేటు పాఠశాలల్లో ఉచితంగా విద్యనందించేలా చర్యలు తీసుకున్నారు. దానిని కొనసాగింపుగా ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేరడానికి దరఖాస్తులు చేసుకోడానికి అవకాశం కల్పించింది. దీంతో జిల్లా వ్యాప్తంగా 1,380 మంది దరఖాస్తు చేసుకున్నారు. 2023లో 1,162 మంది సీట్లు దక్కించుకోగా 2024లో 1,163 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి కేవలం 912 మందిని మాత్రమే విద్యాశాఖ ఎంపిక చేసింది. 5 ఏళ్లు నిండిన వారికి మాత్రమే ఒకటవ తరగతిలో ప్రవేశం కల్పిస్తుండగా రిజర్వేషన్ల ప్రాతిపదికన సీట్లను ఆడపిల్లలు, హెచ్ఐవీ బాధిత పిల్లలు, దివ్యాంగులకు 5 శాతం సీట్లు, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బీసీ, మైనారిటీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు 6 శాతం సీట్లు ఇవ్వాల్సివుంది. ఇంతవరకు బాగానే ఉన్నా విద్యాశాఖ ఎంపిక చేసిన పిల్లలను చేర్చుకోడానికి ప్రైవేటు విద్యాసంస్థలు ముందుకురావడం లేదు. గత మూడేళ్లుగా తమకు చెల్లించాల్సిన ఫీజులు చెల్లిస్తేనే తమ స్కూళ్లలో ఉచిత ప్రవేశాలకు అవకాశం కల్పిస్తామని ఖరాఖండిగా చెబుతున్నారు. దీనితో ఎంపికైన విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది.

చేర్చుకోకుంటే స్కూల్ గుర్తింపు రద్దు చేస్తాం

పేద విద్యార్థులకు ప్రైవేటు విద్యాసంస్థల్లో చేరికకు తప్పనిసరిగా అవకాశం కల్పించాలి. విద్యార్థులను చేర్చుకోకుంటే ఆయా స్కూళ్ల గుర్తింపు రద్దుచేసేలా ప్రభుత్వానికి నివేదిక ఇస్తాం. జిల్లాలో ఎంపికైన 912 మంది విద్యార్థులను చేర్చేలా కృషిచేస్తున్నాం.



క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి


కుమార్‌రాజు మృతదేహం

చింతలపూడి: చింతలపూడి మండలం, జార్జిపేట గ్రామానికి చెందిన గాదె కుమార్‌రాజు(45) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. మంగళవారం పొలంలో పనికి వెళ్లిన కుమార్‌రాజు తెగిపడి ఉన్న విద్యుత్ వైరును చూసుకోకుండా నీళ్లలోకి దిగడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య ఇటీవలే మృతి చెందడంతో కుమారుని వద్ద ఉంటున్నాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కుమార్‌రాజు మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

విద్యుత్ బిల్లులు పెంచి మరోసారి మోసం


బుడితి సుజన్ కుమార్ (ఫైల్)

అత్తిలి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నిత్యావసరాల ధరలు అడ్డూ అదుపు లేకుండా పెంచి సామాన్య ప్రజలపై పెనుభారం మోపుతుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దివ్యాంగ విభాగం పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు బుడితి సుజన్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. విద్యుత్ బిల్లులు ఎట్టి పరిస్థితుల్లోనూ పెంచమని ఎన్నికల ముందు చంద్రబాబు బూటకపు హామీలను గుప్పించి అధికారం చేపట్టిన మరుక్షణమే అనేక సార్లు విద్యుత్ బిల్లులు పెంచి ప్రజలను దారుణంగా మోసం చేశారన్నారు. మరోపక్క వేసవి తాపంతో అల్లాడుతుంటే అసంఘటిత విద్యుత్ కోతలు విధించడంతో వృద్ధులు, చంటిపిల్లలతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించి కేవలం ప్రచార ఆర్భాటాలతో కాలం గడిపేస్తోందని ఎద్దేవా చేశారు. విద్యార్థులకు స్కాలర్ షిప్, తల్లికి వందనం, వసతి దీవెన వంటి పథకాలకు తిలోదకాలిచ్చి పేద విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెడుతుందని ఆరోపించారు. ప్రభుత్వ వ్యవస్థలను గుప్పెట్లో పెట్టుకుని కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించిన వారిని దారుణమైన వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. ఈ కూటమి ప్రభుత్వానికి రానున్న రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

సరిహద్దు వివాదంలో కత్తులతో ఇరువర్గాల దాడి

ఏలూరు టౌన్: సరిహద్దు వివాదంపై ఇరువర్గాలు కత్తులతో దాడులకు పాల్పడ్డాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక ఫిరంగులదిబ్బ ప్రాంతానికి చెందిన ఇబ్బా వెంకటేశ్వరరావుకు, మరో వ్యక్తి వెంకటేశ్వరరావు మధ్య ఇంటి సరిహద్దు వివాదం ఉంది. ఈ నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం వీరిద్దరూ బాహాబాహీకి దిగి రాడ్డులతో కొట్టుకున్నారు. కుటుంబ సభ్యులు ఇద్దరినీ ఏలూరు సర్వజన ఆసుపత్రిలో చేర్చగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఇదే సందర్భంలో నాగరాజు తన తండ్రి ఇబ్బా వెంకటేశ్వరరావును పరామర్శించి ఆసుపత్రి నుంచి ఇంటికి వెళుతుండగా మార్గమధ్యలో రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో వేరే వర్గానికి చెందిన కొందరు అతడ్ని నిలువరించి ఘర్షణకు దిగారు. ఇరు వర్గాలు కత్తులతో దాడులకు పాల్పడ్డారు. ఈ ఘటనలో నాగరాజుతో పాటు మరికొందరికి గాయాలయ్యాయి. వారిని ఏలూరు జీజీహెచ్‌లో చేర్పించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉండడంతో అతడ్ని విజయవాడ సర్వజన ఆసుపత్రికి తరలించారు. దీనిపై ఏలూరు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

డ్రెయిన్లు ఇలా.. మురుగు పారేదెలా!

- అరకొరగా కొన్ని డ్రెయిన్ల పూడికతీత పనులు
- మేజర్ డ్రెయిన్లలో పనులే చేపట్టని వైనం
- ఏటా పొలాలు ముంపునకు గురవుతున్నాయని రైతుల ఆవేదన


ఉండి వెలివర్రు వంతెన వద్ద మేటలు వేసిన గుర్రపుడెక్కతో బొండాడ డ్రెయిన్


ఉండి అక్విడెక్టు వద్ద చెత్తాచెదారంతో బిగుసుకుపోయిన బొండాడ డ్రెయిన్

ఉండి: మేజర్ డ్రెయిన్లలో పూడిక తొలగింపు పనులు చేపట్టకపోవడంపై రైతులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. డ్రెయిన్లలో ఎక్కడికక్కడ గుర్రపుడెక్క, చెత్తాచెదారం పేరుకుపోయి మురుగు పారుదల సక్రమంగా లేకపోవడంతో వర్షాకాలంలో డ్రెయిన్లు పొంగి పంట పొలాలు నాశనమవుతున్నాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో వరి చేలల్లో చేరిన నీరు సైతం బయటకు పోవాలంటే డ్రెయినేజీ వ్యవస్థ కట్టుదిట్టంగా ఉండాలి. కానీ అధికారుల నిర్లక్ష్యమో, పాలకుల పాపమో తెలియదు గాని నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోను మేజర్ డ్రెయిన్‌ల పరిస్థితి మాత్రం అధ్వానంగా ఉంది. పంటకాలువల్లో అక్కడక్కడా కొన్ని ప్రాంతాల్లో ఇరిగేషన్ అధికారులు పూడికతీత పనులను మమ అనిపించారు.

బొండాడను పట్టించుకోలేదు

మూడు మండలాల్లో విస్తరించి వున్న బొండాడ మేజర్ డ్రెయిన్‌ను మాత్రం అధికారులు పట్టించుకోలేదు. ఇక్కడ పూడికతీత పనులు నిర్వహించకుండా అధికారులు నిర్లక్ష్యం చేయడంపై రైతులు మండిపడుతున్నారు. ఈ డ్రెయిన్ ద్వారా ఉండి మండలంలోని కోలమూరు, ఉప్పులూరు, చిలుకూరు, వెలివర్రు, ఉండి, ఎన్నార్పీ అగ్రహారం, మహదేవపట్నం, వాండ్రం, కాళ్ల మండలంలోని బొండాడ, జక్కరం, కోపల్లె, ఎల్ఎన్‌పురం, ఆకివీడు మండలంలోని పెదకాపవరం, చినకాపవరం గ్రామాల్లోని వరిసాగు, ఆక్వాసాగు వ్యర్థాలు పారుతుంటాయి. అయితే ఈ ఏడాది కొన్ని డ్రెయిన్లలో పూడికతీత పనులు చేపట్టిన అధికారులు మేజర్ డ్రెయిన్ అయిన బొండాడను ఎందుకు పట్టించుకోలేని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా బొండాడ మేజర్ డ్రెయిన్‌లో ఉండి అక్విడెక్టు వల్ల దానికి పైనున్న కోలమూరు, ఉప్పులూరు, చిలుకూరు, వెలివర్రు, ఉండి, ఎన్నార్పీ అగ్రహారం, మహదేవపట్నం గ్రామాల వరిసాగుతో పాటు ఆక్వాసాగు నీట మునుగుతుంది. అక్విడెక్టు వద్ద ఎత్తున గుర్రపుడెక్క, చెత్తాచెదారం మేటలు వేయడంతో సమస్య తీవ్రరూపం దాల్చుతుంది. అయితే వేసవి సమయంలో అక్విడెక్టు వద్ద మేటలను తొలగించాల్సిన అధికారులు సాగు సమయంలో లేదా వర్షాలు వస్తున్న సమయంలోనో, రైతులు ముంపునకు గురయ్యామని గగ్గోలు పెట్టినప్పుడు మాత్రమే పొక్లెయిన్‌ల సహాయంతో తాత్కాలిక పనులు చేపడుతున్నారు. ఈ పనులను కనీసం వేసవిలోగాని, నీరు తగ్గిన సమయంలో గానీ ఎందుకు చేపట్టడం లేదని ముంపు గ్రామాల రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇవే కాకుండా పలు మీడియం, మైనర్ డ్రెయిన్లలోను పూడికతీత పనులు నిర్వహించకపోవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. అలాగే ఆకివీడు మండలంలో ఉప్పుటేరు మేజర్ డ్రెయిన్, కాళ్ల మండలంలో బొండాడ మేజర్ డ్రెయిన్.7 కిమీ.మేర, పాలకోడేరు మండలంలో పాలిమేర కోడు, గోస్తనీ డ్రెయిన్ వంటి పలు మేజర్ డ్రెయిన్‌లను కూడా అధికారులు పట్టించుకోలేదు. వీటిలో కనీసం పూడికతీత పనులు చేపడితే రైతులు నిర్భయంగా సాగు చేసుకుంటారని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఆక్వా సాగుకు ప్రమాదమే

నియోజకవర్గంలోని పలు మేజర్ డ్రెయిన్‌లు బిగదన్నడంతో చాలాసార్లు వరిసాగుతో పాటు ఆక్వాసాగు కూడా నీట మునిగింది. దీంతో రైతులు తీవ్ర నష్టాలు చవిచూశారు. ఆక్వాజోన్ ఉన్న ఉండి నియోజకవర్గంలో డ్రెయిన్‌ల పరిస్థితి దారుణంగా ఉంటే ఇక ఆక్వా పరిస్థితి ఏమవుతుందో అని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఏటా ముంపు చవిచూస్తున్నాం



ప్రతి ఏటా వర్షాకాలంలో, తుపాను సమయాల్లో డ్రెయిన్లు పొంగి పొలాల మీద పడడంతో రైతులు నష్టాలు చవిచూస్తునఆనరు. మేజర్ డ్రెయిన్‌లు బిగదన్నడంతో ముంపు భయంతోనే వ్యవసాయం చేస్తున్నాం. ఇది అధికారులకు తెలిసి కూడా పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టడం లేదు.

– నిమ్మల కేశవకుమార్, ఎంపీటీసీ, రైతు, ఉప్పులూరు

ప్రభుత్వమే ఆదుకోవాలి



రైతుకు అండగా నిలిచిన ప్రభుత్వమే పది కాలాల పాటు ప్రజల గుండెల్లో నిలిచిపోతుంది. రైతుల సమస్యలను తెలుసుకుని అధికారులు ప్రభుత్వానికి నివేదించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలి. రైతులను పట్టించుకోకపోతే కాడి విడిచి పెట్టి వ్యవసాయానికి నమస్కారం చెబుతాడు.

– వర్రే పైడియ్య, మాజీ ఎంపీటీసీ, రైతు, పాములపర్రు

రేణుకాచౌదరిపై చర్యలు తీసుకోవాలి


కర్రి గౌరీ సుభాషిణి, జెడ్పీటీసీ, పెనుమంట్ర

పెనుమంట్ర: తెలంగాణ కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను పెనుమంట్ర జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణి తీవ్రంగా ఖండించారు. మంగళవారం ఆమె మార్టేరు లో ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. వైఎస్ జగన్‌పై వ్యక్తిగత కక్షతో మాతృమూర్తులు తలదించుకునే వ్యాఖ్యలు చేసిన రేణుకా చౌదరిపై తక్షణం చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ విధంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎంతో మంది తల్లులను రెచ్చగొట్టి వారి బిడ్డలను చంపించే ప్రయత్నం చేస్తున్న రేణుకపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే రాష్ట్రంలో జరుగుతున్న అకృత్యాలు చూసి సహించలేని పరిస్థితి నెలకొందని, ఒక తల్లిగా ఇటువంటి వ్యాఖ్యలు చేయడం సహించరాని విషయం అన్నారు.

చిన్నారిపై అత్యాచారం కేసులో నిందితుడి అరెస్టు

ఆకివీడు: స్థానిక సంతపేటలోని పడాల వారి వీధిలో ఏడేళ్ల చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడిన వృద్ధుడు షేక్ మీరాను మంగళవారం చెరుకువాడ ప్రాంతంలో అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు ఆకివీడు రూరల్ సీఐ జగదీశ్వరరావు చెప్పారు. నిందితుడిని భీమవరంలోని కోర్టుకు హాజరుపరచగా ఈ నెల 23వ తేదీ వరకూ రిమాండ్ విధించినట్లు తెలిపారు. అతనిపై కిడ్నాప్, అత్యాచారం, పోక్సో చట్టాల కింద కేసులు నమోదు చేసిన విషయం విదితమే. కేసును భీమవరం డీఎస్పీ జయసూర్య దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

సంత మార్కెట్‌లో చెత్తాచెదారాల తొలగింపు


మార్కెట్‌లో వ్యర్థాలను, చెత్తాచెదారాలను తొలగిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని బ్రహ్మానందరెడ్డి సంత మార్కెట్, పండ్ల మార్కెట్‌లో మంగళవారం సాయంత్రం చెత్త చెదారాలు, వ్యర్థాలను తొలగించారు. మార్కెట్‌లో చెత్తాచెదారాలు, వ్యర్థాలు తొలగించడం లేదని, ఈగలు వాలడం, దుర్గంధం వెదజల్లుతుండడంతో 'పొంచి ఉన్న వ్యాధుల ముప్పు' శీర్షికన సాక్షి మంగళవారం కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన మున్సిపల్ సిబ్బంది కూరగాయల మార్కెట్, పండ్ల మార్కెట్ వద్ద పరిసరాలను పరిశుభ్రం చేశారు. పారిశుద్ధ్య కార్మికులచే, రెండు స్వచ్ఛ ఆంధ్ర మిషన్ కాంపాక్టర్‌లను ఉపయోగించి చెత్తాచెదారాలు, వ్యర్థాలను తొలగించారు. మామిడి పండ్ల ట్రేలలో వ్యర్థాలను సైతం తొలగించారు.

గ్రామాల్లో తాగునీటి సరఫరాకు చర్యలు


గుండుగొలనులో ఫిల్టర్ బెడ్స్‌లోని నీటిని పరిశీలిస్తున్న ఎస్ఈ త్రినాథబాబు

సాక్షి స్పందన

భీమడోలు: గ్రామాల్లో తాగునీటి కోసం గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులపై 'తాగునీటి వెతలు' శీర్షికన మంగళవారం సాక్షి కథనాన్ని ప్రచురించింది. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారులు స్పందించారు. గ్రామాల్లో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ టి.త్రినాధబాబు ఆకస్మికంగా పర్యటించారు. గుండుగొలనులో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రామారావు, ఏఈ సుబ్రహ్మణ్యంలతో కలిసి ఆయన వింధ్యవాసిని, బ్రాహ్మణ చెరువుల నీటి మట్టాలను పరిశీలించారు. ఇకపై పూర్తిగా బోర్ నీటిని ఇవ్వద్దని, తక్కువ బోర్ నీటిని మంచినీటిలో కలిపి ఫిల్టర్ చేసి గ్రామ ప్రజలకు సరఫరా చేయాలని గ్రామకార్యదర్శికి సూచించారు. గుండుగొలను, భీమడోలు, కురెళ్లగూడెం, పూళ్ల తదితర గ్రామాల్లోని మంచినీటి చెరువుల్లో చిక్కపడిన నీరు పల్చబడేందుకు పటికను కట్టించారు. ఫిల్టర్ బెడ్స్‌లో నింపుతున్న నీటిని ఆయన పరిశీలించారు. చెరువుల్లోని నీటి నాణ్యతను పరీక్షించేందుకు నమూనాలు సేకరించారు. గోదావరి కాల్వకు నీటిని వదిలిన నేపథ్యంలో రెండు, మూడు రోజుల్లో పూర్తిస్థాయిలో నీటి మట్టాలు పెరిగే అవకాశాలున్నాయన్నారు. తక్షణమే చెరువుల్లోకి నీటిని నింపేలా తగు చర్యలను తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో గ్రామకార్యదర్శి కేవీ తనూజ, సచివాలయ ఉద్యోగులు, ఆర్‌డబ్ల్యూఎస్ వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్, సిబ్బంది చందు తదితరులు పాల్గొన్నారు.

జూదాలకు బానిసై యజమాని ఇంట్లోనే చోరీ


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ ప్రతాప శివ కిషోర్

- నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు
- చోరీ సొత్తు రూ.23.76 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ ప్రతాప శివ కిషోర్

ఏలూరు టౌన్: జూదాలకు బానిసైన ఓ వ్యక్తి తాను పనిచేసే యజమాని ఇంట్లోనే చోరీకి పాల్పడ్డాడు. చివరకు ఈ కేసులో పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి అతడి నుంచి రూ.23.76 లక్షల విలువైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ కొమ్మి ప్రతాప శివ కిషోర్ వివరాలు వెల్లడించారు. గణపవరం గ్రామానికి చెందిన సరిపల్లి రాజు అలియాస్ వెంకటరాజు అనే వ్యక్తి చిలువూరి వెంకట రామరాజు అలియాస్ వెంకన్న బాబు చెరువుపై పనిచేస్తున్నాడు. సరిపల్లి రాజు పేకాట, క్రికెట్ బెట్టింగ్, మద్యం వంటి దురలవాట్లకు బానిసై యజమాని ఇంట్లోనే చోరీ చేసేందుకు స్కెచ్ వేశాడు. యజమాని రామరాజు మే నెలలో హైదరాబాద్ వెళ్లడంతో సరిపల్లి రాజు ఈ నెల మొదటివారంలో రాత్రిపూట యజమాని ఇంటి వెనుక తలుపులు పగులుకొట్టి లోనికి ప్రవేశించి చెక్క బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలను అపహరించుకుపోయాడు. దీనిపై బాధితుల ఫిర్యాదు మేరకు గణపవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చోరీ చేసిన బంగారు ఆభరణాలను భీమవరంలో విక్రయించేందుకు వెళ్తుండగా ఈనెల 10న సరిపల్లి గ్రామం సీపీఎఫ్ ఫ్యాక్టరీ వద్ద నిందితుడు సరిపల్లి రాజును పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. చోరీ సొత్తు 33 కాసుల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ చూపిన నిడమర్రు సీఐ ఎంవీ సుభాష్, గణపవరం ఎస్సై ఏ.మణికుమార్, పోలీస్ సిబ్బంది ఏయూజీ శంకర్, డీ.శివాజీ, హోంగార్డు పీ.జగపతిబాబును ఎస్పీ శివ కిషోర్ అభినందించారు. విలేకరుల సమావేశంలో ఏఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, ఏలూరు డీఎస్పీ డీ.శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.


వర్షాలతో ఈపీడీసీఎల్ అప్రమత్తం

విశాఖ సిటీ: భారత వాతావరణ శాఖ భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో, ఏపీఈపీడీసీఎల్ అప్రమత్తమైంది. ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు సంస్థ వెల్లడించింది. ఈ మేరకు సంస్థ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి అధికారులను అప్రమత్తం చేశారు. ఆయన ఆదేశాల మేరకు వినియోగదారులకు 24 గంటలు సేవలందించేందుకు కార్పొరేట్ కార్యాలయంతో పాటు సంస్థ పరిధిలోని 11 జిల్లాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయాలు లేకుండా చూసేందుకు అవసరమైన యంత్రాంగాన్ని, పరికరాలను, సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాలని సూపరింటెండింగ్ ఇంజనీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లను సీఎండీ ఆదేశించారు. అధికారులందరూ వినియోగదారులకు అందుబాటులో ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో సిబ్బందికి ఎటువంటి సెలవులు మంజూరు చేయవద్దని ఎస్ఈలకు సూచించారు. విద్యుత్ అంతరాయాలకు సంబంధించిన సమాచారాన్ని వినియోగదారులు కంట్రోల్ రూమ్ నంబర్లు కార్పొరేట్ ఆఫీస్ 1912, ఏలూరు 94409 02926, పశ్చిమ గోదావరి 94906 10152లో తెలియజేయాలని ఏపీఈపీడీసీఎల్ కోరింది.

ఇప్పుడు మోగల్లు వంతు

- గుడిమెలకోడు ఆక్రమణలు తొలగించాలని పంచాయతీ నోటీసులు
- ఆందోళన చెందుతున్న 72 కుటుంబాలు


మోగల్లు అరుంధతిపేటలో ఇళ్లను కూల్చి చేయడానికి మార్కింగ్ ఇచ్చారని చూపుతున్న స్థానికులు


పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన నోటీసు

పాలకోడేరు: అభివృద్ధి చర్యల్లో భాగంగా ఆక్రమణల తొలగింపునకు ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు పట్టుబట్టడం సామాన్యుల పాలిట శాపంగా మారింది. ఏళ్ల తరబడి నివాసం సాగిస్తున్న ఎస్సీ కుటుంబాలకు ప్రత్యామ్నాయం చూపకుండా ఉన్నట్టుండి ఆక్రమణల పేరుతో వాటిని తొలగించానికి అధికారులు చర్యలు తీసుకోవడం ఉండి నియోజకవర్గంలో కలకలం సృష్టిస్తుంది. మొన్న ఆకివీడు మండలంలోని అయిభీమ వరం, సమతానగర్‌లో ఇళ్లు తొలగించగా ఇటీవల పాలకోడేరు ఏఎస్ఆర్ నగర్‌లో ఆక్రమణలను తొలగించారు. ఇప్పుడు మోగల్లు వంతు వచ్చింది. గ్రామంలోని అరుంధతిపేటలో గుడిమెల కోడును ఆక్రమించి కట్టుకున్న గృహాలను వెంటనే తొలగించాలని గ్రామపంచాయతీ నోటీసులు జారీ చేసింది. దీంతో బాధితులు స్థానిక పాత్రికేయల వద్ద తమ గోడును వెల్లబోసుకున్నారు. గుడుమెలకోడు ప్రాంతంలో దశాబ్దాల తరబడి సుమారు 72 కుటుంబాల వారు ఇళ్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నామని, ఇప్పటికిప్పుడు తమను ఖాళీ చేయమంటే పిల్లా పాపలతో ఎక్కడికి వెళ్లాలని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు భరోసా ఇవ్వాల్సిన ఎమ్మెల్యే ప్రత్యామ్నాయం చూపకుండా ఇలా అర్థాంతరంగా ఖాళీ చేయమనడం న్యాయం కాదని కన్నీటి పర్యంతం అవుతున్నారు.

పంచాయతీ కార్యదర్శి వివరణ

దీనిపై పంచాయతీ కార్యదర్శి కె.సుజాతను సాక్షి వివరణ కోరగా గుడిమెలకోడు ఆక్రమణకు గురికావడంతో వాటి కింద నివసించే సుమారు 750 గృహాల వారు వర్షాకాలంలో ముంపు బారిన పడుతున్నారని ఈ సమస్యపై వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన పరిశీలించి ఆక్రమణలు తొలగించాలని ఆదేశాలు జారీచేసినట్లు చెప్పారు. ఆక్రమణదారులకు 15 రోజులు గడువు ఇచ్చినట్లు స్పష్టం చేశారు.

జీజీయూలో ప్రపంచ స్థాయి విద్యా ప్రమాణాలు


ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న దృశ్యం

రాజానగరం: ఆస్ట్రేలియాలోని మెక్వైరీ యూనివర్సిటీ, ప్రముఖ సంస్థ కేపీఎంజీ ఇండియాలతో స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) అవగాహన ఒప్పందాలు చేసుకుంది. యూనివర్సిటీలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో దీనికి సంబంధించిన పత్రాలపై ప్రొ.ఛాన్సలర్ కె.శశికిరణ్‌వర్మ, కేపీజీఎం ఇండియా ప్రతినిధి నారాయణ్ రామస్వామి సంతకాలు చేసి, పరస్పరం మార్చుకున్నారు. ఈ సందర్భంగా జీజీయూ ఛాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) మాట్లాడుతూ, విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యా ప్రమాణాలతో బోధన అందించేందుకు జీజీయూ ఎప్పుడూ ముందుంటుందన్నారు. ప్రొ.ఛాన్సలర్ శశికిరణ్‌వర్మ మాట్లాడుతూ దీని ద్వారా బీటెక్‌లో సైబర్ సెక్యూరిటీ స్పెషలైజేషన్ చేసేందుకు అవకాశాలుంటాయన్నారు. కేపీజీఎం ఇండియా ప్రతినిధి నారాయణ్ రామస్వామి మాట్లాడుతూ, డిజిటల్ టెక్నాలజీ వేగంగా అభివృద్ధి చెందుతున్న క్రమంలో జీజీయూతో కలిసి పని చేయడం ద్వారా విద్యార్థులకు చక్కటి భవితను అందించే అవకాశం లభించిందన్నారు. మెక్వైరీ యూనివర్సిటీ సైబర్ స్కిల్ అకాడమీ సీఈఓ మాట్ బుష్‌బై ఆన్‌లైన్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో కేపీఎంజీ ఇండియా ప్రతినిధులు మహావీర్, రాఘవన్ ఎస్, జీజీయూ సాంకేతిక సలహాదారు సుమంత్, వైస్ ఛాన్సలర్ డాక్టర్ కేవీబీ రాజు, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంఎంఎస్ శర్మ, డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, ప్రిన్సిపాళ్లు, డైరెక్టర్లు, డీన్‌లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాల తనిఖీ

జంగారెడ్డిగూడెం: నిబంధనలు ఉల్లంఘించి భవనాలు నిర్మిస్తున్నారని అందిన ఫిర్యాదు మేరకు మంగళవారం పట్టణంలోని ఏడు భవనాలను రాజమండ్రి రీజనల్ డైరెక్టర్ కార్యాలయం నుంచి వచ్చిన అధికారులు తనిఖీలు చేశారు. టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ జ్యోత్స్న, టీపీఏ రమణ, స్థానిక టీపీవో చాందిని, సచివాలయ సిబ్బంది తనిఖీల్లో పాల్గొన్నారు. నిబంధనలను అతిక్రమించినట్లు గుర్తించారని, నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తారని చాందిని తెలిపారు.

కొల్లేరును 3వ కాంటూరుకు కుదించాలి

- ఎకో సెన్సిటివ్ జోన్‌ను ఉపసంహరించుకోవాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్


రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

ఏలూరు(ఆర్ఆర్‌పేట): కొల్లేరును 5 నుంచి 3వ కాంటూరుకు కుదించాలని, కొల్లేరు ప్రజల ఉపాధిని కాపాడాలని, ఎకో సెన్సిటివ్ జోన్‌ను ఉపసంహరించుకోవాలని సీపీఎం ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. మంగళవారం ఏలూరు ఉద్దరాజు రామం భవనంలో సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి అధ్యక్షతన కొల్లేరు ప్రజల సమస్యల పై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వివిధ ప్రజా సంఘాలు, కొల్లేరు ప్రాంత నాయకులు, రైతు సంఘాలు, సామాజిక వేత్తలు పాల్గొని కొల్లేరు ప్రజల సమస్యలపై చర్చించారు. 2006లో ఆపరేషన్ కొల్లేరు పేరుతో ఐదో కాంటూరు లోపల ఉన్న వేలాది ఎకరాలను చెరువులన్నింటినీ ధ్వంసం చేసి లక్షలాదిమంది కొల్లేరు ప్రజల జీవనాన్ని నాశనం చేశారని విమర్శించారు. దీనికితోడు కొందరు పర్యావరణం పేరుతో సుప్రీంకోర్టుకు వెళ్లారని, ఇందులో రాష్ట్ర ప్రభుత్వం ఇంప్లీడ్ కాకపోవడంతో కొల్లేరు పేదల సాగులో ఉన్న 15వేల ఎకరాలు చెరువులు ధ్వంసం వేయాలని సుప్రీంకోర్టు ఏకపక్షంగా తీర్పు ఇచ్చిందన్నారు. కొల్లేరు చుట్టుపక్కల 89 గ్రామాల్లోని లక్షలాదిమంది ప్రజల పొట్ట కొట్టే నిర్ణయాన్ని తక్షణమే కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బీ.బలరాం, రిటైర్డ్ ఐఆర్ఎస్, కొల్లేరు గ్రామాల అభివృద్ధి సంఘం అధ్యక్షుడు చాగంటి సంజయ్, కొల్లేరు ప్రాంత మహిళా నాయకురాలు ఘంటసాల వెంకటలక్ష్మి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహనరావు, కొల్లేరు రైతు సంఘం, కొల్లేరు గ్రామాల అభివృద్ధి సంఘం నాయకులు తదితరులు మాట్లాడారు.

రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్లు

- కొల్లేరును 5 నుంచి 3వ కాంటూరుకు కుదించాలి. కొల్లేరు ఆపరేషన్ సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలి. కొల్లేరు ప్రజలకు జీవనోపాధి కల్పించాలి. 146 సొసైటీలు పునరుద్ధరణ చేయాలి. 14,800 ఎకరాలు జిరాయితీ భూమి హక్కుదార్లకు అప్పగించాలి.
- కొల్లేరు ప్రజల సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలి. ప్రస్తుత అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి, సుప్రీంకోర్టుకు నివేదించాలి.
- కొల్లేరు చుట్టుపక్కల ఫ్యాక్టరీల నుంచి వస్తున్న మురుగు నివారణకు చర్యలు తీసుకోవాలి. ప్రతిపాదిత రెగ్యులేటర్లు నిర్మించాలి. 3వ కాంటూరు పరిధిలో సరస్సును అభివృద్ధి చేయాలి.
- కొల్లేరులో ఉన్న వేలాది ఎకరాలు ప్రభుత్వ భూములను పేదలకు పంచాలి. అటవీ అధికారుల వేధింపులు, అవినీతి అరికట్టాలి.
- 5వ కాంటూరు పైన కొల్లేరు ఆపరేషన్ పేరుతో కొట్టేసిన 9వేల ఎకరాలు తిరిగి అప్పగించాలి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఆ ప్రాంత ప్రజలకు అదనంగా ఉపాధి హామీ పనులు కల్పించాలి.
- కొల్లేరు ఆపరేషన్ సందర్భంగా ప్రజలకు ఇస్తానన్న నష్టపరిహారం, ఉపాధికల్పనకు చర్యలు చేపట్టాలి. కొల్లేరు గ్రామాలకు రోడ్లు, విద్యుత్, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించాలి.

కొత్త పింఛన్ల కోసం ఎదురుచూపులు

- ఏడాది గడిచినా ఒక్క పింఛను మంజూరు చేయని వైనం
- సచివాలయాల చుట్టూ తిరుగుతున్న దరఖాస్తుదారులు
- గత జగన్ ప్రభుత్వ హయాంలో నిరంతర ప్రక్రియ
- అప్పట్లో అర్హతే ప్రామాణికంగా కొత్త పింఛన్లు
- నేడు పింఛను కట్ చేస్తారేమోనని దివ్యాంగుల్లో భయం


తణుకులో జగన్ ప్రభుత్వ హయాంలో పెంచిన పింఛను పంపిణీ సభలో ఆనందోత్సాహంలో పింఛనుదారులు

తణుకు అర్బన్: పింఛను పొందే అర్హత ఉన్నా పింఛను మంజూరు చేయడ లేదని సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నామంటూ ప్రజానీకం మండిపడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా ఒక్క కొత్త పింఛను కూడా ఇవ్వ లేదంటూ గగ్గోలుపెడుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన రోజు నుంచి కొత్త పింఛను కోసం ప్రజానీకం దరఖాస్తులు పెట్టుకుంటున్నా ఇంతవరకు ఒక్క పింఛను కూడా కొత్తది ఇవ్వలేదని వాపోతున్నారు. గత జగన్ ప్రభుత్వ హయాంలో పింఛను మంజూరు అంశం నిరంతర ప్రక్రియగా ఉండేదని కానీ నేటి కూటమి ప్రభుత్వం ఏర్పడి ఈనెల 4వ తేదీ నాటికి ఏడాది పూర్తిచేసుకున్నా ఇంతవరకు పింఛన్లు కొత్తవి మంజూరు చేయలేదంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గతంలో ఘనంగా..

గతంలో భర్త చనిపోయిన వితంతువులు, 60 సంవత్సరాలు వయస్సు వచ్చిన వారు, వికలాంగత్వం ధృవీకరణ ధ్రువపత్రాలు సమకూర్చుకున్న వారితో పాటు డయాలసిస్ రోగుల వివరాలు వలంటీర్లు తెలుసుకుని మరీ పింఛను కోసం దరఖాస్తులు నేరుగా తీసుకుని సచివాలయ వ్యవస్థ ద్వారా ఆన్‌లైన్ చేయించేవారు. దీంతో కులం, మతం, పార్టీ బేధాల్లేకుండా అర్హతే ప్రామాణికంగా పింఛను మంజూరు చేసే ప్రక్రియ నిరంతరం కొనసాగేది. అప్పట్లో ప్రజలు సైతం ఈ విధానాన్ని స్వాగతించారు. కానీ నేటి కూటమి ప్రభుత్వ హయాంలో ఇప్పటికే తణుకు నియోజకవర్గంలో వందల సంఖ్యలో పింఛను కోసం దరఖాస్తులు చేసుకున్నా ప్రభుత్వం మంజూరు చేయకపోవడం అసలు మా దరఖాస్తులు ఉన్నాయా లేదంటే బుట్ట దాఖలయ్యాయా అని దరఖాస్తుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలో 37,493 మందికి పింఛన్లు

తణుకునియోజకవర్గంలోని తణుకు పట్టణం, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాల్లో దివ్యాంగులు, వితంతువులు, వృద్ధులు, డయాలసిస్ ఇతర విభాగాలకు సంబంధించి 37,493 మందికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్లు ఇంటి గుమ్మం లోకి వలంటీరు వ్యవస్థ ద్వారా అందజేశారు.

పరేషాన్‌లో దివ్యాంగులు

కొత్త పింఛన్లు ఇవ్వకపోగా గతేడాది డిసెంబరు నెల 9వ తేదీ నుంచి దివ్యాంగుల పింఛను సక్రమమా అక్రమమా అనే విషయాన్ని తేల్చేందుకు కూటమి ప్రభుత్వం పింఛన్లు వెరిఫికేషన్‌కు తెరతీసింది. ఇప్పటికే పలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఈ వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. దీంతో వెరిఫికేషన్‌కు వస్తున్న పింఛనుదారులు కూటమి తీసుకున్న ఈ నిర్ణయాన్ని తీవ్రంగా విమర్శిస్తున్నారు. గత 25ఏళ్లుగా పింఛను తీసుకుంటున్నామని ఇప్పుడు మా వికలాంగత్వం అక్రమమని ఎందుకు అనుమానం వచ్చిందంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పింఛను ఉంచుతారో తొలగిస్తారో అంటూ అధిక శాతం దివ్యాంగులు బెంబేలెత్తిపోతున్నారు. ఈ ఏడాది జూలై నెల వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని అధికారులు చెబుతున్నారు.

కొత్త పింఛను కోసం ఎదురుచూపులు



కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా ఇంతవరకు ఒక్క కొత్త పింఛను కూడా మంజూరు చేయలేదు. పింఛను అందితే తమ పోషణకు ఇబ్బంది లేకుండా ఉంటుందని పింఛను అర్హతతో దరఖాస్తు చేసుకున్న పింఛనుదారుల చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే తణుకు నియోజకవర్గంలో వందల సంఖ్యలో కొత్త పింఛను కోసం దరఖాస్తు మీద దరఖాస్తు సచివాలయ సెక్రటరీలకు అందజేస్తున్నారు. కొత్త పింఛన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం చొరవ చూపించకపోవడంతో అర్హులంతా తమ పోషణకు నానాయాతన పడుతున్నారు. వెంటనే పింఛను కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన దరఖాస్తుదారులకు పింఛను మంజూరు చేయాలి.

– పొట్ల సురేష్, వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు

పింఛను ఇప్పించండి మహాప్రభో



కొత్త పింఛన్లు మంజూరు చేస్తే మంచి ఆహారం, మందుల కోసం ఖర్చుచేసుకునేందుకు పేదవర్గాలకు చెందిన వృద్ధులు, దివ్యాంగులు ఆశగా ఎదురుచూస్తున్నారు. దరఖాస్తులు పట్టుకుని సచివాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచిపోయినా ఇంతవరకు పింఛను మంజూరు చేయకపోగా, దివ్యాంగులను పింఛన్ల వెరిఫికేషన్ పేరుతో ఆస్పత్రుల చుట్టూ తిప్పుతూ నానాయాతన పెడుతున్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా దివ్యాంగులందరి పింఛనును వెరిఫికేషన్ చేయించడంతో పింఛను తొలగిస్తారేమోనని దివ్యాంగులు భయాందోళనలో గడుపుతున్నారు.

– బుడితి సుజన్ కుమార్, వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు

క్లుప్తంగా

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


యోగా సాధకులచే సాధన

తాడేపల్లిగూడెం (టీఓసీ): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని పలువురు వక్తలు తెలిపారు. ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆదేశాలు మేరకు ఆరా ఫౌండేషన్ యోగా గురువు కరిబండి రామకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం యోగా ప్రోటోకాల్ సాధన చేశారు. సత్యవతి నగర్ ఉమర్ ఆలీషా విశ్వ విజాన ఆధ్యాత్మిక పీఠంలో 60 మంది యోగా సాధకులు పాల్గొన్నారు. రామకృష్ణ మాట్లాడుతూ యోగాతో ఆరోగ్యం సాధ్యమవుతుందని, వివిధ ఆసనాలు, సూర్య నమస్కారాలు, వాటి విశిష్టతలు తెలియజేశారు. దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్స యోగాలో ఉందని, గురువు సంరక్షణలో యోగా చేయాలని కోరారు. అపర్ణ ప్రసాద్, భోగవిల్లి రాజేశ్వరరావు, ప్రసాద్, లక్ష్మీనారాయణ, నున్న నాగేశ్వరరావు, రాంబాబు, సూరిబాబు, రామాంజనేయులు, వెలగల రాఘవ, సుజాత, సుభద్ర, రేణుక తదితరులు పాల్గొన్నారు.

26 మంది వృద్ధులకు ఉచిత వైద్యసేవలు


తణుకులో వృద్ధులకు వైద్యసేవలందిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: సజ్జాపురం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక రాష్ట్రపతి రోడ్డులోని అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన వైద్య శిబిరానికి హాజరైన 26 మంది వృద్ధులకు సీనియర్ వైద్యులు డాక్టర్ భూపతిరాజు రమేష్‌చంద్రబాబు వైద్య సేవలు అందజేశారు. ఈ సందర్భంగా వృద్ధులు ఆహార విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నడక వంటి వాటిపై అవగాహన కల్పించారు. బీపీ, సుగర్ వైద్యపరీక్షలు నిర్వహించి పేద వృద్ధులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ, తణుకు శాఖ అధ్యక్షులు ఈదర ప్రసాదరావు, కార్యదర్శి కోసూరి గాంధీ, సభ్యులు ఇవటూరి లక్ష్మణరావు, చేబ్రోలు సాధు, కె.వెంకటరెడ్డి పాల్గొన్నారు.

కేవీకే శిక్షణ కార్యక్రమాలను వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న కేవీకే విస్తరణ అధికారి డాక్టర్ వి.దీప్తి

తాడేపల్లిగూడెం రూరల్: కృషి విజ్ఞాన కేంద్రం నిర్వహించే స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమాలను వినియోగించుకోవాలని వెంకట్రామన్నగూడెం కేవీకే విస్తరణాధికారిణి డాక్టర్ వి.దీప్తి అన్నారు. వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని రామన్నగూడెం గ్రామంలో ముందస్తు ఖరీఫ్‌పై, అపరాల పంటలో సమగ్ర యాజమాన్య పద్ధతులు, భూసార, ఆకుపరీక్షల ప్రాముఖ్యతపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ దీప్తి మాట్లాడారు. గేదెల పరిశోధన సంస్థ అధిపతి డాక్టర్ కే.ఆనందరావు పశుగ్రాస రకాలు, పాల ఉత్పత్తి పెరగడానికి తీసుకోవలసిన చర్యలను రైతులకు వివరించారు. అనంతరం రైతులకు కూరగాయల సాగు పుస్తకాలు, జీవన ఎరువులు అందజేశారు. పెదవేగి ఆయిల్‌పామ్ పరిశోధన సంస్థ ప్రతినిధి డాక్టర్ ఆర్‌పీ ప్రేమలత, గ్రామ సహాయ అధికారి నాగరాజు, మద్దిపాటి రవితేజ, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలి


మాట్లాడుతున్న కోనాల భీమారావు

పెంటపాడు: కూటమి ప్రభుత్వం ప్రజలను నమ్మించి మోసం చేసిందని, తక్షణమే సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం పెంటపాడు ఆర్యవైశ్యసేవసంఘ భవనంలో సీపీఐ మండల మహాసభ కళింగ లక్ష్మణరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. విశాఖ ఉక్కు కార్మికులను రోడ్డున పడేసిందన్నారు. ఈ కార్యక్రమంలో బండారు శ్రీనివాసరావు, సీపీఐ నాయకులు దిద్దే నాగేశ్వరరావు, ఉయ్యూరు సత్యనారాయణ, కౌణతాల నాగరాజు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

5న జాతీయ లోక్ అదాలత్


డి.సత్యవతి

తణుకు అర్బన్: కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం కోసం వచ్చేనెల 5వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి పేర్కొన్నారు. రాష్ట్ర న్యాయ సేవల సంస్థ గుంటూరు వారి ఉత్తర్వులు మేరకు నిర్వహించే ఈ జాతీయ లోక్ అదాలత్‌లో రాజీపడు క్రిమినల్ కేసులు, ఎక్సైజ్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, ప్రోనోటు కేసులు, అన్ని రకాల సివిల్ కేసులు రాజీ చేయనున్నట్లు చెప్పారు. కక్షిదారులు తమ విలువైన సమయాన్ని, ధనాన్ని వృథా చేసుకోకుండా తమ కేసులను పరిష్కరించుకునే దిశగా కృషి చేయాలని సూచించారు. పోలీసు అధికారులు కక్షిదారులకు వారి కేసులపై అవగాహన కల్పించి ఇరు పక్షాలను రాజీమార్గానికి సిద్ధంచేసి జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని ఆదేశించారు.

బాలికల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

పెంటపాడు: యుక్తవయస్సు వస్తున్న బాలికల ఆరోగ్యంపై తల్లిదండ్రులు, ఐసీడీఎస్ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని పెంటపాడు సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ, కార్యదర్శుల సంఘ జిల్లా నాయకురాలు డి.నాగదేవిలు పేర్కొన్నారు. మంగళవారం పలు గ్రామాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీలు, బాలికల అవగాహన సమావేశాలు, మానవహారాలు నిర్వహించారు. సూపర్‌వైజర్లు జీజీబీ విజయలక్ష్మి, సుజాతలతో పాటు, ఆరోగ్యశాఖ సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్లు ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు జరిగాయి. పలు సెంటర్లలో కిషోర్‌వికాశం కార్యక్రమం జరిగింది. దీనిలో భాగంగా యుక్తవయస్సు బాలికలకు హిమోగ్లోబిన్ (హెచ్‌బీ) పరీక్షలు నిర్వహించారు. అవగాహన సమావేశం నిర్వహించారు. అనంతరం ఐసీడీఎస్ సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. పోక్సో చట్టంపై వివరించారు. వయస్సు నిండకుండా వివాహాలు చేయడం వల్ల కలిగే అనర్థాలను తెలియజెప్పారు.

నేత్రపర్వంగా వరాల వెంకన్న చక్రస్నాన పూజలు


ఈడూరులో వరాల వెంకన్నకు చక్రస్నాన పూజలు నిర్వహిస్తున్న దృశ్యం


ఈడూరులో చెరువులో ఉత్సవ విగ్రహాలతో దేవాలయ కమిటీ సభ్యులు

అత్తిలి: ఈడూరు గ్రామంలో వేంచేసియున్న వరాల వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలలో భాగంగా మంగళవారం స్వామివారికి చక్రస్నాన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం గ్రంధి రవికుమార్, సత్యలక్ష్మి దంపతులచే సుప్రభాతసేవ, మేలుకొలుపు, తోమాలసేవలను జరిపారు. అనంతరం మూల హోమాలు, మహాపూర్ణాహుతి, ధ్వజారోహణ కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యలు ఆధ్వర్యంలో పూజాదికాలను జరిపారు. స్వామివారి ఉత్సవమూర్తిని మేళతాళాలతో ఊరేగింపుగా వెళ్లి గ్రామానికి చెందిన దండు శ్రీనివాసు చెరువులో శ్రీస్వామివారి చక్రస్నాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఈకార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ ఆకుల వెంకటనారాయణ, గ్రామస్థులు పాల్గొన్నారు.

డయాలసిస్ యూనిట్ సేవలు అభినందనీయం


తణుకులో డయాలసిస్ యూనిట్‌ను పరిశీలిస్తున్న లయన్స్ గవర్నర్ వేణుగోపాలరావు

తణుకు అర్బన్: లయన్స్ డిస్ట్రిక్ట్ వంక సత్యనారాయణ, నాగమణి రీనల్ డయాలసిస్ యూనిట్ అందజేస్తున్న సేవలు అభినందనీయమని లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కాకర్ల వేణుగోపాలరావు అన్నారు. తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో డయాలసిస్ సెంటర్‌ను మంగళవారం పైడిపర్రు, తేతలి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆయన సందర్శించి మాట్లాడారు. యూనిట్ ఆధ్వర్యంలో 15 బెడ్ల ద్వారా డయాలసిస్ రోగులకు డయాలసిస్ ప్రక్రియ జరుగుతుండడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ తన తల్లిదండ్రుల పేరుమీద పది పడకలతో ప్రారంభించిన ఈ యూనిట్ నేడు 15 పడకలకు విస్తరించి రోగుల మన్ననలు పొందుతుందని లయన్స్ క్లబ్‌కు ఎంతో గర్వకారణమన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ ద్వారా సుమారుగా రూ. 1.25 కోట్లు బకాయిలు రావాల్సి ఉన్నప్పటికీ సేవాదృక్పధంతో యూనిట్‌ను ఎటువంటి ఇబ్బంది లేకుండా నడుపుతున్నారని ప్రశంసించారు. ఈ సందర్భంగా రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం రోగులకు అందుతున్న సేవలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తణుకు మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ వంక రాజకుమారి, లయన్స్ మాజీ గవర్నర్లు మాదిరెడ్డి బాబూజీరావు, దామెర్ల రంగారావు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు కంభాల రంగారావు, చీర్ల వెంకటేశ్వరరావు, వీజీఆర్ నాయుడు, ఉందుర్తి ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం


కిశోర వికాసంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మి సరస్వతి


కిశోర వికాసంపై ర్యాలీ

తాడేపల్లిగూడెం రూరల్: బాలికలకు వివాహ వయస్సు రాకుండా వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని తాడేపల్లిగూడెం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో టి.లక్ష్మి సరస్వతి అన్నారు. కిశోర వికాసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని కొండ్రుప్రోలు రైతు భరోసా కేంద్రంలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో సరస్వతి మాట్లాడుతూ యుక్త వయస్సు వచ్చిన తర్వాత వివాహాలు చేయడం వల్ల బాలికల్లో దాంపత్య జీవితంపై ఒక అవగాహన ఉంటుందన్నారు. చిన్న వయస్సులో వివాహాలు చేయడం వల్ల గర్భస్థ దశలో అనేక సమస్యల వస్తాయన్నారు. తల్లిదండ్రులు ఆడపిల్లలకు యుక్త వయస్సు వచ్చిన తర్వాతే వివాహాలు చేయాలని సూచించారు. సూపర్‌వైజర్ ఎస్తేరు రాణి, జీఎంఎస్‌కే వీణ, అంగన్‌వాడీ కార్యకర్తలు సుమలత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అలాగే, కృష్ణాయపాలెం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వెంకటసుబ్బలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే.శ్రీదేవి, ఏఎన్ఎం సుభాషిణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. నీలాద్రిపురంలో జరిగిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.బేబి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్న వయస్సులో వివాహాలు చేయడం సరికాదు

తాడేపల్లిగూడెం (టీఓసీ): చిన్న వయస్సులో వివాహాలు చేయడం సరికాదని, చట్ట ప్రకారం యుక్త వయస్సు వచ్చిన తరువాతే పెళ్లి చేయాలని అంగన్‌వాడీ టీచర్ సత్యవతి, మహిళా పోలీస్ స్వప్న, శ్రీ, భవిత సెంటర్ ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాల ఈశ్వరయ్య, ఆరోగ్య కార్యకర్త డి.సుష్మలు పేర్కొన్నారు. కిశోర్ వికాసం వేసవి శిక్షణ శిబిరం మంగళవారం పట్టణంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో ముగిసింది. అవగాహన ర్యాలీ జరిగింది. వక్తలు మాట్లాడుతూ చిన్న వయస్సులో వివాహాలు చట్టరీత్య నేరమని, బాల వివాహాలు ప్రోత్సహించవద్దని తెలిపారు. చిన్న వయస్సులో వివాహం చేయడం వల్ల పిల్లలు అనేక రకాల వైకల్యాలతో జన్మించవచ్చునని, తగు జాగ్రత్తలు తప్పక తీసుకోవాలని చెప్పారు. 18 సంవత్సరాలు తరువాత మాత్రమే ఆడ పిల్లలకు పెళ్లి చేయాలని తెలిపారు. కిశోర్ వికాసం బాలికలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి


వార్డులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): దోమకాటు ఆరోగ్యానికి చేటు అని, ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సబ్ యూనిట్ అధికారి వై.వీ.లక్ష్మణరావు ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించే విధంగా చూడాలని, ఆరోగ్య నియమాలు పాటించాలని, పరిసరాలు పరిశుభ్రత అవశ్యకతను వెల్లడిస్తూ పట్టణంలోని 17వ వార్డులో మంగళవారం హెల్త్ సిబ్బందిచే ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, ర్యాలీ, వెక్టార్ కంట్రోల్ హైజీన్ పరిశీలనలు జరిగాయి. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఇంటి పరిసరాలలో, ఇంటిలోను నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. వారానికి ఒక్కసారి ఫ్రైడే డ్రైడే పాటించాలని, దోమల ద్వారా వచ్చే వాధ్యులను అరికట్టేందుకు ప్రజలు సహకారం ఎంతో అవసరమని తెలిపారు. పారిశుద్ధ్య సిబ్బందికి, హెల్త్ సిబ్బందికి తప్పక సహకరించాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు రాజేశ్వరీ, ఆరోగ్య సహాయకులు కాంతారావు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశాలు స్వాతి, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు తక్షణమే వేతనాలు చెల్లించాలి


కొమ్మరలో ఉపాధి కూలీలలో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

అత్తిలి: గ్రామీణ కూలీలకు ఒక వరంలా ఉన్న ఉపాధి హామీ చట్టంలో పనిచేస్తున్న కూలీలకు వేతనాలు చెల్లించకుండా మీనమేషాలు లెక్కిస్తుందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ళ చిన వీరభద్ర రావు ప్రభుత్వాన్ని విమర్శించారు. అత్తిలి మండలం కొమ్మర గ్రామ శివారు ఉప్పరగూడెంలో పనిచేస్తున్న కూలీలను మంగళవారం ఆయన కలిసి వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా వీరభద్ర రావు మాట్లాడుతూ పేదరిక నిర్మూలన, వలసలు నివారణ, గ్రామీణ పేదల జీవన ప్రమాణాలు మెరుగు పరచడం వంటి ఉన్నతమైన లక్ష్యాలతో ఉపాధి హామీ చట్టం వచ్చిందని ఈ చట్టం గ్రామీణ పేదలకు అసరాగా ఉంటూ వారికి పని గ్యారంటీ అనే ధైర్యాన్ని కలిగించిందని ఆయన చెప్పారు. చట్టం ప్రకారం చేసిన పనికి 15 రోజుల్లోగా వేతనాలు చెల్లించాలని నిబంధన ఉన్నప్పటికీ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఉపాధి కూలీలకు మూడు మాసాలుగా బకాయిలు చెల్లింపులో జాప్యం చేయడం సరి కాదని వీరభద్ర రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వేతన బకాయిలు వెంటనే చెల్లించి ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దనికొండ దుర్గ, గండికోట హేమలత, పెరుమాళ్ళ జీవన బాబు, దుర్గారావు అనంతలక్ష్మి కోటమ్మ పాల్గొన్నారు.

మధుమేహం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



డైమండ్స్, వాకర్స్ సభ్యులకు సుగర్ పరీక్షలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మధుమేహం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తరుచుగా సుగర్ పరీక్షలు చేయించుకోవాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పేరిచర్ల ఫౌండేషన్ వ్యవస్థాపకులు మురళీకృష్ణంరాజు అన్నారు. పట్టణంలో డైమండ్స్ క్లబ్, పేరిచర్ల ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆర్అండ్‌బి గ్రౌండ్స్‌లో మంగళవారం ఉచిత సుగర్ వైద్య శిబిరం, ఆరోగ్య అవగాహన కార్యక్రమం జరిగింది. పేరిచర్ల మాట్లాడుతూ శారీరానికి వ్యాయమం తప్పనిసరి అన్నారు. యోగా చేయాలని, నడక, మంచి ఆహారపు అలవాట్లు అలవర్చుకోవాలని తెలిపారు. వేసవిలో సుగర్, బీపీలు అధికంగా ఉంటాయని తగు జాగ్రత్తలు తప్పక తీసుకోవాలన్నారు. విశ్రాంత విద్యాధికారి గాజుల మురళీకృష్ణ, అసోసియేషన్ కార్యదర్శి మానేపల్లి కిరణ్, వాకర్స్ వైస్ ప్రెసిడెంట్ దంగేటి ముఖర్జీచే అల్పాహారం, జావ అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంధి అపర్ణ ప్రసాద్, సత్యనారాయణ, కె.సాయిరాజు, మండా ప్రకాష్ కుమార్, వాకర్స్ సభ్యులు, లయ ఏక్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఖరీఫ్ వరి నాట్లు


పుల్లాయగూడెం గ్రామంలో ట్రాక్టర్‌తో దుక్కులు దున్నుతున్న దృశ్యం


వీరంపాలెంలో నాట్లు వేస్తున్న బెంగాలీ కూలీలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలో ఖరీఫ్ వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ సీజన్‌లో రమారమీ 12వేల హెక్టార్లలో వరి నాట్లు పడవలసిఉంది. ముందస్తుగానే వరి నాట్లను రైతాంగం చేపట్టింది. దీంతో ప్రస్తుతం మండలంలో దుక్కులు దున్నడం, వరి నాట్లను వేస్తున్నారు. బెంగాలీ కూలీలు సైతం మండలానికి రావడంతో ఈ ప్రక్రియ మరింత ఊపందుకుంది. ప్రస్తుతం వీరంపాలెం, నీలాద్రిపురం గ్రామాల్లో వరి నాట్లు వేయగా, పుల్లాయగూడెం, కృష్ణాపురం, అప్పారావుపేట, కొమ్ముగూడెం, కడియద్ద, చినతాడేపల్లి, పట్టింపాలెం, బంగారుగూడెం, మాధవరం, ఎల్.అగ్రహారం, నవాబుపాలెం, కొత్తూరు, ఆరుళ్ల, నందమూరు, జగన్నాథపురం, మోదుగగుంట, గొల్లగూడెం, ఉప్పరగూడెం, మెట్ట ఉప్పరగూడెం, తాళ్లపాలెం తదితర గ్రామాల్లో దుక్కులు దున్నే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే పీఆర్.126 రకం నారుమడి పోసారు. వర్షాలు, చీడపీడలను తట్టుకుని నిలబడే రకం కావడంతో ఎక్కువగా రైతాంగం ఈ రకం వరి రకంపై మక్కువ చూపుతున్నారు. మరో నాలుగైదు రోజుల్లో దుక్కుల పనులు పూర్తయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి. జూన్ నెలాఖరు నాటికి మండలంలో పూర్తిస్థాయిలో వరి నాట్లు పడే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు.

ఎండల కారణంగా ఆలస్యం



రోహిణి కార్తె ఎండ తీవ్రత కారణంగా ఖరీఫ్ నాట్లు కొంత ఆలస్యమైంది. ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్నాయి. మరో రెండు, మూడు రోజుల్లో వాతావరణం చల్లబడి వర్షాలు పడితే రైతులకు మరింత ఊతమిస్తుంది. నెలాఖరు నాటికి ఊడ్పులు పూర్తయ్యే అవకాశం ఉంది.

– కాగితపు శ్రీను, రైతు, పుల్లాయగూడెం, తాడేపల్లిగూడెం మండలం